సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 23 । డిసెంబర్ । 2023



సైన్స్‌కు సమాజానికి అవినాభావ సంబంధం

సైన్స్‌కు సమాజానికి అవినాభావ సంబంధం ఉందని ఈ రెండింటిని వేరు చేయడం అసంభవం అని కేయూ వీసీ రమేష్ అన్నారు.

- 8లో ▶



భారతీయ రైల్వేను స్తంభింపజేస్తాం

పెండింగ్ సమస్యలు, డిమాండ్లు పరిష్కరించకుంటే భారతీయ రైల్వేను స్తంభింపజేస్తామని రైల్వే సంఘ్ ఏజీఎస్ భానుప్రసాద్ అన్నారు.

- 8లో ▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం $28.0^0/14.0^0$

ఉదయం మంచు ఎక్కువగా కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు సమావేశం

భూపాలపల్లి రూరల్: నేడు జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో జరిగే జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని టీన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు బూరు గు రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు, కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

వన్య ప్రాణులను రక్షించాలి



టేకుమట్ల: అడవిలోని వన్యప్రాణులను వేటగాళ్ల బారి నుంచి రక్షించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేష్ అధికారులను కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలిశాల గుట్టల్లోని వన్యప్రాణులను కొంత మంది వేటగాళ్లు ఉచ్చులు పెట్టి చంపుతున్నారని అన్నారు. నిత్యం జింక, మెకం, అడవి గొర్రె, కుందేళ్లు, అడవి పందులను ఉచ్చులతో చంపి మాంసాన్ని గ్రామాల్లో విక్రయిస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీ జీవులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా నాయకులు ఆకునూరి జగన్ ఉన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాల్సిందే..

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో అనేక పోరాటాల ద్వారా ఏఐటీయూసీ నాయకులు కొమురయ్య కార్మిక చట్టాలను సాధించినట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఏరియాలోని కేటీకే 1వ గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. అనేక కార్మిక చట్టాలను సాధించిన ఘనత ఏఐటీయూసీదేనని అన్నారు. ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలవగానే కార్మికుల సొంతింటి కల నెరవేర్చే బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. ఆదాయపన్ను తగ్గిస్తామని, సింగరేణి పాఠశాలలను బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, విజేందర్, రామచందర్, పోశం, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

'వాటాలు పంచుకున్నాయి..'

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పదేళ్లుగా అవినీతి పెరిగిందని పైరవీలు, కారుణ్యనియామకాల పేరుతో కార్మికుల నుంచి దోచుకున్న డబ్బులను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, అనుబంధ టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు వాటాలు పంచుకున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సింగరేణిలో క్లరికల్ రిక్రూట్‌మెంట్, మెడికల్ బోర్డులో అవినీతి పెరిగి పోయిందన్నారు. ఒక్కో కార్మికుడి నుంచి రూ.6లక్షల నుంచి రూ.8లక్షల వరకు వసూలు చేసినట్లు చెప్పారు. మెడికల్ బోర్డులో రూ.500కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. ఈ డబ్బులను హైదరాబాద్‌కు చెందిన స్పెషలిస్టు వైద్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, రెండు సంఘాల నాయకులు పంచుకున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



మహదేవపూర్: మావోయిస్టులు భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో మండలకేంద్రంలో జాతీయ రహదారి బొమ్మపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ బృందం సందర్శన



గణపురం: కరోనా పాజిటివ్‌తో ఎంజీఎంలో చికిత్స పొందుతున్న గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన దొంగరి ఆగమ్మ (65) ఇంటిని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ బృందం శుక్రవారం పరిశీలించింది. కుటుంబసభ్యులు ఐసోలేషన్‌లో ఉండాలని సూచించారు. కరోనా పాజిటివ్ కేసు నమోదుతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అతివేగం.. నిద్రమత్తు..



ఎల్కతుర్తి రోడ్డు ప్రమాదానికి ఇవే కారణాలు?

- ఏటూరునాగారం నుంచి వేములవాడకు బయలుదేరిన ఏడుగురు
- హైవే కావడం.. షాపింగ్ ఉండడంతో హనుమకొండ మీదుగా ప్రయాణం
- ఎదురెదురుగా ఢీకొన్న కారు, లారీ.. ఐదుగురు దుర్మరణం..
- మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు.. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రమాదంలో తుడిచిపెట్టుకుపోయిన కాంతయ్య కుటుంబం





మృతులు :
మంతెన భరత్(29)
శంకర్ (60)
(తండ్రీకొడుకులు)
మంతెన కాంతయ్య (72)
మంతెన చందన(16) (తండ్రీకూతుళ్లు)



హైవే రోడ్డు అని చెప్పి

ఏటూరునాగారం నుంచి వేములవాడకు వెళ్లేందుకు మూడు మార్గాలున్నాయి. ఏటూరునాగారం, ములుగు, అబ్బాపూర్, రేగొండ, పరకాల, హుజూరాబాద్, కరీంనగర్, వేములవాడ వెళ్లే అవకాశం ఉంది. ఈ రోడ్డు సరిగ్గా లేదు. మరోమార్గంలో భూపాలపల్లి మీదుగా వెళ్లొచ్చు. కానీ ఈ మార్గం దూరభారం, అధ్వానమైన రోడ్డు ఉంటుందని అటువైపు వెళ్లకుండా ఉండిపోయినట్లు తెలుస్తోంది. హనుమకొండ మీదుగా అయితే హైవే కావడం.. దీంతోపాటు వరంగల్ నగరంలో షాపింగ్ చేయాల్సి ఉండడం, భరత్ అయ్యప్ప మాల వేసుకోవడంతో అక్కడ అల్పాహారం చేసి వెళ్దామని ఈ మార్గంలో వచ్చినట్లు భావిస్తున్నారు. భరత్‌కు డ్రైవింగ్ రావడంతో.. తన తల్లి శ్రీదేవి సోదరి కుమారుడి కారును తీసుకుని సెల్ఫ్ డ్రైవింగ్ చేశాడు. హనుమకొండలో షాపింగ్.. టిఫిన్ చేసి.. తిరిగి వేములవాడకు బయల్దేరగా.. మార్గమధ్యలోనే ఈ ఘోర ప్రమాదం జరిగింది.



మృతదేహాలను చూసేందుకు తరలివచ్చిన గ్రామస్తులు



ఎంజీఎం ఆస్పత్రి వద్ద మృతుల బంధువులు, గ్రామస్తులు

కృష్ణా జిల్లాకు వెళ్తున్న లారీ.. పరారీలో డ్రైవర్

రోడ్డు ప్రమాదానికి సంబంధించిన (ఏపీ07టీజే1466) లారీ గుజరాత్ నుంచి కృష్ణా జిల్లాకు వెళ్తోంది. కార్లు, బస్సులు, లారీలు తదితర వాహనాల టైర్ల తయారీకి ఉపయోగించే పౌడర్‌ను తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ సయ్యద్ మస్తాన్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

నెత్తురోడుతున్న దారులు

- కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న యాక్సిడెంట్లు
- ఈ ఏడాది ప్రమాదాలు 445.. మృతులు 480
- తీవ్ర గాయాలు 76.. స్వల్ప గాయాలు 744
- ప్రాణాలు తీస్తున్న అతివేగం

- వరంగల్ క్రైం

8 లో ▶

ఏటూరునాగారం/ఎల్కతుర్తి/ఎంజీఎం:

సెల్ఫ్ డ్రైవింగ్.. అతివేగం.. నిద్రమత్తు.. పొగమంచు.. వెరసి ఐదు ప్రాణాలు గాల్లో కలిశాయి. అందరూ ఒకే కుటుంబ సభ్యులు. అన్నదమ్ముల పిల్లలు. కారును అద్దెకు తీసుకున్న వీరు.. సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వేములవాడ రాజన్న దర్శనానికి బయల్దేరారు. కారు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఏడుగురి లో మార్గమధ్యలోనే ఐదుగురి ప్రాణాలు పోగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట, శాంతినగర్ సమీపంలోని హనుమకొండ–కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఈ ప్రమాదం జరిగింది.



చికిత్స పొందుతూ మృతి చెందిన రేణుక

కారు నుజ్జునుజ్జు.. ఇరుక్కుపోయిన క్షతగాత్రులు

లోడ్‌తో ఉన్న లారీ కుడి వైపు కింది బంపర్ భాగంలో కారు తాకినట్లు ఘటనా స్థలం వద్ద చూస్తే అర్థమవుతోంది. ఈరోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఒకవైపు పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఉన్న డబుల్ రోడ్డు మీదుగానే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు వాహనాలు వేగం మీద ఉండడం.. అర్ధరాత్రి కావడంతో పొగమంచు పడుతుండడంతో.. ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయి రోడ్డు కింది వైపునకు దూసుకెళ్లింది. లారీ కింది భాగంలో తప్ప మరెక్కడా డ్యామేజీ కాలేదు. కారు నడుపుతున్న భరత్‌తోపాటు అతడి తండ్రి శంకర్, మంతెన కాంతయ్య, అతడి కూతురు చందన అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీట్లో కూర్చున్న రేణుక, శ్రీదేవి, భార్గవ్‌కు తీవ్ర గాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. రోడ్డు ప్రమాదం జరిగిన కొద్ది సేపటికి నేషనల్ హైవే పనులు నిర్వహించే క్యాంపు నుంచి కార్మికులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈమేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది, కార్మికుల సహకారంతో క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను కారు నుంచి వెలికితీయడానికి నానాయాతన పడాల్సి వచ్చింది. రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగించే క్రేన్, జేసీబీల సాయంతో సుమారు 15 మంది వరకు రోడ్డు నిర్మాణసంస్థ కార్మికులు, పోలీసులు గంటన్నరకు పైగా శ్రమించి మృతదేహాలను నుజ్జునుజ్జయిన కారు నుంచి బయటకు తీశారు.





చికిత్స పొందుతున్న తల్లి,కుమారుడు మంతెన శ్రీదేవి, భార్గవ్

ఎంజీఎం నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు

గాయపడిన ఏటూరునాగారానికి చెందిన మంతెన రేణుక, మంతెన శ్రీదేవి, మంతెన భార్గవ్ పరిస్థితి విషమంగా ఉండగా, ముగ్గురిని మొదట వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్పించారు. అక్కడినుంచి భార్గవ్, శ్రీదేవిలను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రేణుక చికిత్స పొందు తూ చనిపోయింది. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, సోదరుడు ప్రదీప్‌రావు ఎంజీఎంకు వెళ్లి అక్కడ క్షతగాత్రులను పరామర్శించారు. ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యానికి ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నాయకులు సైతం ఎంజీఎంకు వెళ్లి వారికి అవసరమైన వైద్య సదుపాయాలు సమకూర్చారు.

అత్యంత బాధాకరం : మంత్రి సీతక్క

రోడ్డు ప్రమాదంలో సొంత జిల్లావాసులు ఐదుగురు మృతి చెందడంపై రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క స్పందించారు. తమ జిల్లావాసులు చనిపోవడం అత్యంత బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. గాయాలైన ఇద్దరు కోలుకోవా లని ఆకాంక్షించారు. ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని, మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉలి పడితేనే ఉపాధి

వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు మంతెన శంకర్. పేద కుటుంబం కావడంతో చిన్నతనం నుంచి వడ్రంగి పని చేస్తున్నాడు. శంకర్‌కు భార్య శ్రీదేవి, కుమారులు భరత్, భార్గవ్ ఉన్నారు. ఇద్దరు పిల్లలను చదివించాడు. కాగా చిన్న కుమారుడు భరత్ టీఎస్ఎండీసీ ఇసుక క్వారీ కార్యాలయంలో, పెద్ద కుమారుడు భార్గవ్ వాజేడు మండలంలోని ధరణి విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఇద్దరు చేతికి అందినప్పటికీ శంకర్ మాత్రం ఉలిని మరవకుండా వడ్రంగి పని చేస్తూనే ఉన్నాడు. దైవదర్శనానికి వెళ్తున్న క్రమంలో తండ్రి శంకర్, చిన్న కుమారుడు భరత్ మృతితో విషాదం నెలకొంది. తల్లి శ్రీదేవి, పెద్ద కుమారుడు భార్గవ్ పరిస్థితి విషమంగా ఉంది. ఆ కుటుంబానికి నా అనేవారు లేకుండా పోయారు. దీంతో ఆస్పత్రిలో సహాయకులు కూడా లేని దుర్భర పరిస్థితి నెలకొంది.

కుటుంబం మొత్తం బలి

రెక్కాడితే డొక్కాడే కుటుంబం మంతెన కాంతయ్యది. ఏటూరునాగారంలోని తన ఇంటి వద్ద గొడ్డళ్లు, కత్తులు తయారు చేసి, వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందగా రేణుకను రెండోపెళ్లి చేసుకున్నాడు. కాగా కాంతయ్య–రేణుక దంపతులకు ఆలస్యంగా చందన జన్మించింది. ప్రస్తుతం ఆమె స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. కాగా దైవ దర్శనాని కి వెళ్తుండగా వీరి కుటుంబాన్ని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కాంతయ్య, రాధిక చందన ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. రేణుక ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. దీంతో వీరి కుటుంబం మొత్తం రోడ్డు ప్రమాదానికి బలైంది. కనీసం వీరికి తలకొరివి పెట్టేవారు, ఏడ్చేవారు కూడా లేకుండాపోయారు.

విద్యార్థులు రాణించాలి



సమావేశానికి హాజరైన అధికారులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్: శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు రాణించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా విద్యార్థులకు సూచించారు. మ్యాథమెటిక్స్ డే సందర్భంగా తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ విజేతలైన విద్యార్థులకు షీల్డ్‌లతో పాటు ప్రశంసా పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డీఈఓ రాంకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ వాటిక కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి చివరి వారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం పోషణ వాటిక అభివృద్ధి పనులపై ఎంపీడీఓలతో కలెక్టర్ భవేష్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ. జిల్లాలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళల కోసం కుర్చీలు, గుడ్లు పెట్టుకునేందుకు ర్యాకులు, రైస్ కుక్కర్, మిక్సీ మొదలగు సామగ్రి పంపిణీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ అస్పిరేషనల్ జిల్లాలో భాగంగా జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలను రూ.10 కోట్లతో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారి ఎదుగుదలకు అందిస్తున్న ఆహారం, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత మొదలగు విషయాలు తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి ఒక్క పిల్లవాడి సంపూర్ణ వివరాలు నోట్‌చేయాలని సూచించారు. కేంద్రాల్లో పిల్లలకు తెలుగు, ఆంగ్ల భాష బేసిక్‌పై పట్టు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు విటమిన్ డీ లోపం లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. పోషణ్ వాటిక కార్యక్రమం కింద ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాలలో వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేసేందుకు 50 ఎల్‌ఈడీ టీవీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వర్‌రావు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ పురుషోత్తం, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా మోహన్‌శర్మ..?

కాళేశ్వరం పాలకవర్గం రద్దు చేస్తారా..

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఆలయ చైర్మన్‌గా మంథని పట్టణానికి చెందిన అవధాని మోహన్‌శర్మ పేరు వినిపిస్తుంది. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపుకోసం కృషి చేశారు. కాళేశ్వరం దేవస్థానం చైర్మన్‌గా ప్రస్తుతం బీఆర్ఎస్ మహదేవపూర్ మండలం అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. పాలకవర్గం ఏడాది కాలపరిమితి 2024 మార్చి వరకు ఉంది. ఈ ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతమున్న కాళేశ్వరం దేవస్థానం పాలకవర్గాన్ని కూడా రద్దు చేయనున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటి నుంచే మంథనికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ, కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్‌శర్మ పేరును అధిష్టానం పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది.



మోహన్‌శర్మ

ఉపాధి గని.. సిరుల మాగాణి

- అభివృద్ధికి తలమానికంగా నల్లబంగారం
- బొగ్గు ఉత్పత్తి నుంచి విద్యుత్ తయారీ వరకు..

నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: దక్షిణ భారతదేశంలోనే ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణి రాష్ట్రానికి తలమానికంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.800కోట్ల రాయల్టీ పన్నుల రూపంలో చెల్లిస్తోంది. సింగరేణి బొగ్గు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని సుమారు 3వేలకు పైగా భారీ, మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలకు సరఫరా అవుతోంది. సింగరేణి వ్యాప్తంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 20 ఓపెన్ కాస్టులు, 24 భూగర్భ గనుల్లో 42వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు.

1820లో సింగరేణిగా..

1871వ సంవత్సరంలో ఖమ్మం జిల్లా సింగరేణి అనే కుగ్రామం పరిసరాల్లో అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నట్లు కనుగొన్నారు. ఈ క్రమంలో 1886వ సంవత్సరంలో హైదరాబాద్ దక్కన్ కంపెనీ పేరుతో బొగ్గు నిక్షేపాలను వెలికి తీయడానికి సంస్థను స్థాపించారు. 1886లో ఈ సంస్థ మొదటి సారిగా ఖమ్మం జిల్లా ఇల్లందు వద్ద స్టంట్ ఫిట్ బొగ్గు గనిని ఏర్పాటుచేసి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించారు. 1920లో ఈ సంస్థ పేరును ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మార్పుచేశారు.

ప్రభుత్వం ఆధీనంలోకి..

1948లో రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి సింగరేణి కాలరీస్ వచ్చింది. 1956లో కేంద్ర ప్రభుత్వం సింగరేణి కాలరీస్ కంపెనీలో భాగస్వామ్యం తీసుకోగా అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సంస్థగా కొనసాగుతోంది. 1989–1997 మధ్య కాలంలో కంపెనీ ఆర్థిక పరిస్థితి నిరాశపూరితంగా ఉండి, కార్మికులు, ఉద్యోగుల వేతనాల కోసం తడుముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1996–97 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నష్టాలు రూ.1.219కోట్లకు చేరుకొని దాదాపుగా సంస్థ బీఎఫ్ఆర్‌బి దశలోకి వెళ్లి రెండు దఫాలుగా పారిశ్రామిక పునర్నిర్మాణ మండలి పరిశీలనకు ఆదేశించే స్థాయికి దిగజారింది. దీనికి ప్రధాన కారణంగా 1991–92 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 475 సమ్మెలు జరిగాయి. ఉత్పత్తి, ఖర్చు పెరుగుదల, కార్మికులలో తక్కువ స్థాయి పని నైపుణ్యం, యంత్రాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడం, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిలో నిర్లక్ష్యం, కార్మికులలో సంస్థపై అవగాహన లోపం, ఉచిత విద్యుత్ సదుపాయాన్ని దుర్వినియోగం చేయడం తదితర కారణాల వల్ల సంస్థ నష్టాల్లోకి వెళ్లినట్లు పరిశీలనలో వెల్లడైంది, అనంతరం చేపట్టిన పలు విధానాల వల్ల కొన్నేళ్లుగా లాభాలను ఆర్జించడంతో పాటు ఇందుకు శ్రమించిన ఉద్యోగులకు లాభాల్లో వాటాను చెల్లించిన ఘనత దేశంలో సింగరేణి సంస్థకు దక్కింది.

బొగ్గుతో పాటు విద్యుత్ ఉత్పత్తి..

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సొంతంగా 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించింది. సింగరేణి వ్యాప్తంగా 8 ఏరియాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం గల 13 సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది.



భూపాలపల్లి ఏరియా జీఎం కార్యాలయం

గనులతో విస్తరిస్తున్న భూపాలపల్లి

కుగ్రామంగా ఉన్న భూపాలపల్లిలో సింగరేణి గనులు ఏర్పాటు చేయడంతో దినదినం అభివృద్ధి చెంది జిల్లాకేంద్రంగా రూపాంతరం చెందింది. 1988లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు భూపాలపల్లి మండలంలోని కాశీంపల్లి శివారులో కాకతీయ 1వ గని ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచే భూపాలపల్లి అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ప్రస్తుతం ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఓపెన్‌కాస్టు గనులు ఉన్నాయి. 120 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఏరియాలో ప్రత్యక్షం 5,300మంది కార్మికులు, అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఏరియాలోని సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నేడు ఆవిర్భావ వేడుకలు..

సింగరేణి 135వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఏరియాలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. నేడు నిర్వహించే వేడుకలకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. అంబేడ్కర్ స్టేడియంలో వివిధ విభాగాల ఎగ్జిబిషన్లు, తినుబండారాల ఏర్పాటు చేశారు. ఉదయం సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి స్టాల్స్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్లు, స్టాల్స్

క్లుప్తంగా

అపహరించిన సొత్తు స్వాధీనం

● నిందితుడి అరెస్టు



తొర్రూరులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు

తొర్రూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి అపహరించిన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మానుకోట జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన మీసాల రవి.. పట్టణానికి చెందిన మాదేటి సూర్యారావు ఇంట్లో 4నెలలుగా కేర్ టేకర్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఈ నెల 18న ఖమ్మంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఇంటి యజమాని సూర్యారావు, అతని భార్య వెంకటరాజ్యలక్ష్మి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన కేర్ టేకర్ రవి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి అందులోని రూ.3లక్షలు అపహరించాడు. అదే రోజు రాత్రి సూర్యారావు దంపతులు ఇంటికి వచ్చి చూసి డబ్బులు మాయమైనట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. క్లూస్ టీం సాయంతో విచారణ చేపట్టారు. ఇంట్లో పని చేసే రవిని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకుని డబ్బు స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసు నమోదు చేశారు.

నేడు వైకుంఠ ఏకాదశి

హన్మకొండ కల్చరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు, వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా జరగనున్నాయి. ఉదయం 4 గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈమేరకు హనుమకొండ, వరంగల్‌లోని వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

నెత్తురోడుతున్న దారులు

వేగం పనికిరానిది– ప్రాణం తిరిగిరానిది.. ఇవి చాలాచోట్ల మనం చదివిన పదాలే.. కానీ, అవసరం ఉందనో.. సరదా కోసమో.. వాహనాలను అతివేగంగా నడిపి చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఈక్రమంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏదాదికాలంలో వందలాది మంది ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోగా.. ఎంతోమంది గాయపడ్డారు. తాజాగా ఎల్కతుర్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఐదుగురిని మృత్యువు కబళించింది.

445ప్రమాదాలు.. 480మరణాలు

● కమినరేట్ పరిధిలో పెరుగుతున్న ప్రమాదాలు
● ప్రాణాలను తీస్తున్న అతి వేగం..!



ఏటూరునాగారంలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎక్కడ చూసినా నెత్తుటి మరకలే కనిపిస్తున్నాయి. అతివేగం, అజాగ్రత్త కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. దీంతో వందలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. హైవేలపై జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదాలు ఎక్కువగా ఉదయం 2గంటల నుంచి 3గంటల మధ్య జరుగుతున్నాయి. శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ సమీపంలో లారీ, కారును ఢీకొట్టిన ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉదయం 1 నుంచి 1.15 గంటల మధ్య జరిగినట్లు పోలీస్ అధికారులు నిర్ధారించారు. ఉదయం డ్రైవర్లు నిద్రమత్తులో ఉండటం, రోడ్లు విశాలంగా ఉండటంతో వేగం పెంచడం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023 జనవరి 1 నుంచి 2023 డిసెంబర్ 23 వరకు 445 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. 480 మంది మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో 76మంది తీవ్రంగా గాయపడగా.. 744 మందికి స్వల్పంగా గాయపడ్డారు. మొత్తం 1,265 మంది ప్రమాదాల భారిన పడ్డారు. ఈ ఏడాది 445 ప్రమాదాలు జరిగితే 480 మంది మృతి చెందిన సంఘటనలను పరిశీలిస్తే దాదాపు ప్రతిప్రమాదంలో ఒకరి కంటే ఎక్కువమంది మృత్యువాత పడ్డారు. మరణాలకు మూడు రెట్లు గాయపడిన వారు ఉండటం గమనార్హం. ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ చాలా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు వెంట హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం దురదృష్టకరం. గతంలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఉన్నత అధికారులు స్పందించి అక్కడక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాలక్రమేణ అవి కనిపించకుండా పోయాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. హైవేలపై స్పీడ్ నియంత్రణ తక్కువగా ఉంటుంది. దీని కోసం ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల నియంత్రణ మండలి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తాం.. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు. ప్రస్తుతం పొగమంచు అధికంగా ఉండటం వల్ల రాత్రి సమయల్లో ప్రయాణాలు తగ్గించాలి.

– అంబర్ కిషోర్ ఝా, పోలీస్ కమిషనర్

కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల వివరాలు

నెల	ప్రమాదాలు	తీవ్ర గాయాలు	స్వల్ప గాయాలు	మరణాలు
జనవరి	30	9	67	30
ఫిబ్రవరి	37	1	70	43
మార్చి	39	13	72	41
ఏప్రిల్	31	11	53	31
మే	45	6	72	49
జూన్	57	4	65	64
జూలై	33	6	50	35
ఆగస్టు	39	5	74	47
సెప్టెంబర్	30	5	60	30
అక్టోబర్	32	7	58	34
నవంబర్	34	4	51	35
డిసెంబర్	38	5	52	41
మొత్తం	445	76	744	480

ఎక్కువగా లారీలతోనే..

- జూన్ 25న మేడారంలో దైవ దర్శనం చేసుకొని తిరిగి వస్తున్న కారును ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ వేగంగా ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు.
- వరంగల్– ఖమ్మం రహదారిలో ఇల్లెందు దగ్గర ఆగస్టు 16 ఉదయం 7గంటలకు ఆటోను లారీ ఢీ కొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.
- జనవరి 21న నల్లబెల్లి క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.
- ఈనెల 22న ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ సమీపంలో టైర్ల తయారీకి ఉపయోగించే పౌడర్‌ను గుజరాత్ నుంచి తీసుకొస్తున్న లారీ, ఏటూరునాగారం నుంచి వేములవాడకు వెళ్తున్న కారును ఢీకొట్టడంతో రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు మృతి చెందగా.. ఇద్దరు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నారు.

సైన్స్‌కు సమాజానికి అవినాభావ సంబంధం

● కేయూ వీసీ తాటికొండ రమేష్



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రమేష్, పక్కన బన్న అయిలయ్య తదితరులు

కేయూ క్యాంపస్: సైన్స్‌కు సమాజానికి ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం ఉందని ఈరెండింటిని వేరు చేయడం అసంభవం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. శుక్రవారం శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్ గొప్ప మ్యాథమెటీషియన్ అని కొనియాడారు. మానవ పరిణామ క్రమాన్ని భారత దేశ సమగ్ర చరిత్ర పూర్తిగా అధ్యయనం చేసేందుకు విద్యార్థులు మక్కువ చూపాలన్నారు. సైన్స్ విద్యార్థులు సామాజిక శాస్త్రాల అధ్యయనం చేస్తేనే సమాజ జీవనవ్యవస్థ అర్థం అవుతుందని సూచించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ.. సాహిత్యం, సైన్స్, సమాజం ఒకదానితోఒకటి ముడిపడి ఉందన్నారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య హనుమంతు, గణిత విభాగం అధిపతి డాక్టర్ అంజన్‌రావు, అధ్యాపకులు డాక్టర్ నాగయ్య, డాక్టర్ రవీందర్, శ్రీలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీసీ రమేష్ తదితరులు గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పేరిట కూరగాయల ప్లాట్లు



వరంగల్: పేదలు, మధ్యతరగతి ప్రజలు చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అందులో భాగంగా వరంగల్ నగరంలోని లక్ష్మీ పురం కూరగాయల మార్కెట్‌లో అనేకమంది చిరువ్యాపారం చేస్తుంటారు.. అయితే వరంగల్‌లోని లక్ష్మీపురం పాత మార్కెట్ నుంచి మోడల్ మార్కెట్‌కు మార్చిన సందర్భంగా అప్పటి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని చిరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా లేని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పేరుతో ప్లాట్లు కేటాయించారని మండిపడుతున్నారు. మార్కెట్‌లోని అప్పటి అధికార పార్టీ నాయకుడికి అత్యంత సన్నిహితంగా ఉన్న వారు పదుల సంఖ్యల్లో ప్లాట్లు తీసుకున్నారని మార్కెట్ కార్యదర్శితో పాటు ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని పేర్కొంటున్నారు. అనర్హులను తొలగించి, అర్హులకు కేటాయించాలని జాబితా అందజేసినా పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కూరగాయల మార్కెట్‌లో ప్లాట్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని మంత్రి కొండా సురేఖ మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా..



లక్ష్మీపురం మార్కెట్‌లో 20 ఏళ్లగా కూరగాయలు అమ్ముతున్నా. మార్కెట్‌లో నాకు ప్లాట్ కేటాయించలేదు. అనర్హులకు రెండేసి ప్లాట్లు ఇచ్చారు. అర్హులైన పేద చిరు వ్యాపారులను పట్టించుకోలేదు.

– ఎండీ.రహీం, చిరు వ్యాపారి

బాధ్యతలు స్వీకరించిన ఫార్మసీ బీఓఎస్

● ప్రొఫెసర్ కృష్ణవేణికి సన్మానం



కృష్ణవేణిని సన్మానిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ కృష్ణవేణి బాధ్యతలను స్వీకరించారు. దీంతో పలువురు ఆచార్యులు, విద్యార్థులు ఆమెను సన్మానించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రొఫెసర్ కృష్ణవేణి కేయూ హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తించారన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లోని ఆరోగ్య కేంద్రం మెంబర్ ఇన్‌చార్జ్‌గా, బోధన, పరిశోధనాపరంగా అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఇప్పటికే కృష్ణవేణివద్ద నలుగురు పరిశోధకులు డాక్టరేట్‌ను పూర్తిచేశారన్నారు. మరోనలుగురు పరిశోధకులు ఆమె పర్యవేక్షణలో ఉన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఫార్మసీ కళాశాల డీన్ ఆచార్య నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ స్వరూపరాణి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ భాగ్య, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

భారతీయ రైల్వేను స్తంభింపజేస్తాం

● జనవరిలో రిలే నిరాహార దీక్షలు చేపడుతాం
● రైల్వే సంఘ్ ఏజీఎస్ భరణీ భానుప్రసాద్
● ముగిసిన రైల్వే సంఘ్ డివిజనల్ కౌన్సిల్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రసాద్

కాజీపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు, డిమాండ్లు పరిష్కరించకుంటే భారతీయ రైల్వేను స్తంభింపజేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ భరణీ భానుప్రసాద్ అన్నారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో శుక్రవారం సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్ సమావేశాల ముగింపులో ముఖ్య అతిథిగా భరణీ భానుప్రసాద్ మాట్లాడారు. రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపడతామని అన్నారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించకుంటే 1977 నాటి సమ్మె పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. సికింద్రాబాద్ డివిజన్ రైల్వే సంఘ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.పీ.ఎస్.చౌదరి, జి.ప్రభురాజ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో అన్ని విభాగాల్లో ఉన్న దాదాపు 21వేల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మూడో రైల్వేలైన్ నిర్మాణంతో రైల్వే కార్మికుల పైన అదనపు పని భారం పడిందని, అందుకు అనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాజీపేట జంక్షన్‌లో నిర్వహించిన రెండు రోజుల డివిజనల్ కౌన్సిల్ సమావేశాల్లో అన్ని విభాగాల్లో కార్మికుల సమస్యలు తెలుసుకున్నామని, వాటి పరిష్కారం దిశగా కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే సీనియర్ క్లర్క్, సంఘ్ నాయకుడు పాషా పుట్టిన రోజు సందర్భంగా డివిజన్, జోనల్ స్థాయి నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఐటీఎఫ్ నేషనల్ కో ఆర్డినేటర్ సత్యవాణి, డిప్యూటీ డివిజన్ సెక్రటరీ కె.మురళీకృష్ణ, రైల్వే సీడబ్ల్యూసీ మెంబర్లు చింత మురళి, ఎస్.వెంకటనారాయణ, రాజు, మురళీకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాక రాజ్‌కుమార్, ముస్తాక్‌హుస్సెన్, నర్సింగరావు, దిలీప్, శంకర్, అఖిలాష్, ఎండీ.పాషా, కార్మికులు పాల్గొన్నారు.

కేయూలో సమస్యలు పరిష్కరించాలి

● రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కోరిన అకుట్ బాధ్యులు



కోదండరామ్‌తో కేయూలోని సమస్యలపై చర్చిస్తున్న అకుట్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో గత రెండున్నరేళ్లగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, కేయూ అధికారుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) అధ్యక్ష, ప్రధాన, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి, డాక్టర్ కిషోర్ కుమార్.. రాష్ట్ర ఉన్నత విద్యా కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. యూనివర్సిటీ అధ్యాపకులను చిన్న చూపు చూస్తూ, అధ్యాపకులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం యూనివర్సిటీ వీసీ నియామకానికి కావాల్సిన అర్హతలను పక్కనబెట్టి 10 సంవత్సరాల అనుభవం లేని ప్రొఫెసర్లను యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా వీసీలుగా నియమించి యూనివర్సిటీలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. అకుట్ బాధ్యులు విద్యాశాఖ కార్యదర్శికి తెలియజేసిన మరిన్ని విషయాలు..

అర్హత, అనుభవం లేని వీసీలు యూనివర్సిటీ చట్టం 1991కు విరుద్ధంగా రిటైర్డ్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు.

- అర్హులను డమ్మీలుగా చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు.
- యూనివర్సిటీ చట్టం ప్రకారం పూర్తి కాలిక భత్యం తీసుకుంటూ పని చేస్తున్న ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించాలి.
- యూనివర్సిటీ చట్టానికి విరుద్ధంగా 16 మంది అనుబంధ అధ్యాపకులను నియమించారు.
- ఈ నియామకాలకు విరుద్ధంగా హైకోర్టులో కేసు నమోదు కాగా.. ఇటీవల ఏడుగురు అనుబంధ అధ్యాపకులను తొలగించారు.
- యూనివర్సిటీ భూముల విషయంలో కమిటీ ఇచ్చిన రిపోర్టును అమలు చేయలేదు. ల్యాండ్ కమిటీ రిపోర్టును బయటబెట్టలేదు.
- 2010 బ్యాచ్ అధ్యాపకులకు ఇప్పటి వరకు పదోన్నతులు కల్పించకపోగా, వీసీ, రిజిస్ట్రార్‌లు మాత్రం బంధనలకు విరుద్ధంగా సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు పొందారని తెలిపారు.
- ఫార్మసీ విభాగం డీన్‌గా అర్హత కలిగిన ప్రొఫెసర్ ఉన్నా.. ఉత్తర్వులు ఇవ్వకపోవడం, సోషియాలజీ విభాగంలో హెడ్ బీఓఎస్‌ల నియామకం చేపట్టకపోవడం.
- రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాన్ని చేపట్టాలని, ఉద్యోగ వయోపరిమితిని పెంచాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి చర్చించారు. ప్రజావాణిలో కూడా కేయూ సమస్యలు, అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇస్తారి తెలిపారు.

చట్టంపై అవగాహన అవసరం



పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హన్మకొండ: వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'హక్కులు– సమస్యలు– సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చట్టంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసాల నుంచి బయటపడుతారన్నారు. ప్రస్తుత ఆధునికయుగంలో సాంకేతిక అభివృద్ధితోపాటు దాని వల్ల ఎదురయ్యే సమస్యలను వినియోగదారులు అధిగమించాలన్నారు. ప్రొఫెసర్ కృష్ణమాచారి మానవ ప్రవర్తన, మార్పులు, కస్టమర్లపై వాటి ప్రభావం గురించి వివరించారు. అనంతరం టీఎస్‌ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వరలక్ష్మి మాట్లాడారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా 40కి పైగా కళాశాలల నుంచి పరిశోధకులు పాల్గొని రీసెర్చ్ ఆర్టికల్స్ ప్రజెంట్ చేశారు. ఈ సందర్భంగా పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వాహక అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజిరెడ్డి, వాగ్దేవి ఎంబీఏ అధిపతి మహేందర్ కుమార్, సదస్సు కన్వీనర్ సుగుణాకర్ రెడ్డి, సురేష్ చంద్ర, శేషాచలం, హరీందర్ రెడ్డి, రజిన్ కుమార్, కిషోర్, అనూష, ప్రేమ్ కుమార్, కరుణ, చంద్రకళ, అజిత్, శాంభవి పాల్గొన్నారు.

సాంస్కృతిక శోభకు నిదర్శనం కళారూపాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కిషన్‌రావు, ఆచార్య భట్టు రమేశ్

● తెలుగు విశ్వవిద్యాలయం వీసీ తంగెడ కిషన్‌రావు
● 'తెలంగాణ జానపద కళా సౌరభాలు' పుస్తకావిష్కరణ

హన్మకొండ కల్చరల్: సమాజంలో విస్తరించి ఉన్న అనేక జానపద గిరిజన కళారూపాలు తెలంగాణ సాంస్కృతిక శోభకు నిదర్శనమని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ తంగెడ కిషన్‌రావు అన్నారు. వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బాసాని సురేశ్ శుక్రవారం హైదరాబాద్ బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తాను రచించిన 'తెలంగాణ జానపద కళాసౌరభాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, ఆచార్య తంగెడ కిషన్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఠం అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్‌రెడ్డి, డాక్టర్ గంపా సతీశ్, రజిత, ఆచార్య నిరీక్షణబాబు, కోట్ల హన్మంతరావు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ వాహనం ఢీకొని తాపీమేస్త్రీ మృతి



నారాయణ(ఫైల్)

శాయంపేట : ద్విచక్ర వాహనాన్ని హార్వెస్టర్ ఢీ కొనడంతో తాపీ మేస్త్రీ ఎల్లబోయిన నారాయణ(43) మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లికి చెందిన ఎల్లబోయిన నారాయణ (తాపీ మేస్త్రీ)గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై వరంగల్ పట్టణానికి వెళ్లి పని ముగించుకొని రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో గంగిరేణి గూడెం శివారులోని బతుకమ్మ విగ్రహం సమీపంలో అతి వేగంగా డ్రైవర్ బానోతు సైదులు హార్వెస్టర్‌ను నడుపుతూ బైక్‌ను ఢీ కొనడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణ భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరు..

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం –మహదేవపూర్ జాతీయ రహదారిపై బొప్పారం క్రాస్ వద్ద శుక్రవారం ఆటో బోల్తా పడి బొప్పారానికి చెందిన మంతెన రాజయ్య(40) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండల కేంద్రం గారెపల్లి వద్ద ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటో బొప్పారానికి వెళ్తుంది. కిలోమీటర్ దూరం ప్రయాణించకముందే ఆటో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికుల్లో ఆరుగురికి స్వల్పగాయాలు కాగా రాజయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజయ్యను 108 వాహనంలో మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. రాజయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

వరకట్న వేధింపుల కేసులో యావజ్జీవ శిక్ష

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన వివాహితను వరకట్నం కోసం వేధించడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో నిందితులకు వరంగల్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.సత్యేంద్ర యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. వివరాలిలా ఉన్నాయి.. ఏనుగల్‌కు చెందిన నల్లపు భిక్షపతి కుమార్తె అంజలి (23)ని హనుమకొండ మండలం ఆరెపల్లికి చెందిన నరేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్ని రోజులకు భర్త సంగెం నరేష్, అత్త విజయ అదనపు కట్నం కోసం అంజలిని చిత్రహింసలు పెట్టడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. అప్పటి మామునూరు ఏసీపీ మహేందర్ విచారణ చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టులో బాధితుల వాంగ్మూలం పరిశీలించిన జడ్జి సత్యేంద్ర.. అంజలి భర్త నరేష్‌కు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2.10లక్షల జరిమానా, అంజలి అత్త విజయకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా విధించారు.